క్లుప్తంగా

విద్యార్థుల ట్యాబ్స్‌పై 'నవరత్నాలు' స్టిక్కర్



నవరత్నాలు స్టిక్కర్ అతికించిన ట్యాబ్స్ చూపుతున్న 8వ తరగతి విద్యార్థులు

సీతమ్మధార: రాష్ట్ర ప్రభుత్వం 8వ తరగతి విద్యార్థులకు అందించిన బైజూస్ ట్యాబ్స్‌పై నవరత్నాలు స్టిక్కర్ అతికించే కార్యక్రమాన్ని శనివారం పీ అండ్ టీ కాలనీలోని ఎస్ఎంసీ హైస్కూల్‌లో నిర్వహించారు. స్కిల్ డెవలప్‌మెంట్ ఇంటర్న్‌షిప్‌లో భాగంగా డిజిటల్ పరికరాలన్నింటినీ సరిచూసే బాధ్యతను ప్రభుత్వం బాబా ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ విద్యార్థులకు అప్పగించినట్లు హెచ్ఎం రాంప్రసాద్ తెలిపారు. డివైస్‌ల పనితీరును వారు పర్యవేక్షిస్తారన్నారు. ట్యాబ్‌ల వెనుక భాగంలో నవరత్నాలు(సంక్షేమ పథకాల లోగో) స్టిక్కర్స్ అంటించినట్లు చెప్పారు.

రైతులకు గుర్తింపు కార్డుల పంపిణీ



గుర్తుంపు కార్డులు అందిస్తున్న యాసిన్

కంచరపాలెం: కంచరపాలెం రైతుబజార్‌లో ఈవో శెట్టి కృష్ణమూర్తి నేతృత్వంలో శనివారం మార్కెటింగ్ శాఖ ఏడీ షేక్ యాసిన్ సుమారు 182 మంది రైతులకు గుర్తింపు కార్డులు అందించారు. రైతులు కార్డులను సక్రమంగా వినియోగించాలని ఆయన సూచించారు. ముందుగా రైతుబజారులో ఏర్పాటు చేస్తున్న కొత్త సీసీ కెమెరాలను యాసిన్ పరిశీలించారు. కెమెరాల నిఘాతో రైతుబజారులో దొంగతనాలను అరికట్టవచ్చని చెప్పారు.


ఘనంగా ఉపాధ్యాయ సంఘ ఆవిర్భావ దినోత్సవం



ఉపాధ్యాయులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న త్రినాథమూర్తి

సీతమ్మధార: పీ అండ్ టీ కాలనీలోని ఎస్ఎంసీ హైస్కూల్‌లో శనివారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీయూఎస్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.త్రినాథమూర్తి మాట్లాడుతూ బోధనతోపాటు విద్యార్థులను చిన్నతనం నుంచి క్రమశిక్షణ, దేశభక్తి, జాతీయ భావాలు కలిగిన పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో ఆయన సంఘ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్ఎం రాంప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విశేష అలంకరణలో కల్యాణ వేంకటేశ్వరుడు



లలితా పీఠంలో పూజలందుకున్న వెంకన్న

సీతంపేట: పుష్య మాసం, శనివారం సందర్భంగా అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితా పీఠంలో కల్యాణ వేంకటేశ్వరుడు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చాడు. ఆలయ అర్చకులు స్వామివారిని తులసిమాలలు, చామంతి పువ్వులతో విశేషంగా అలంకరించారు. పంచామృతాభిషేకాలు, అర్చనలు, దూప, దీప నైవేద్యాలతో పూజలు చేశారు. భక్తులు స్వామిని దర్శించి పూజలు చేశారు.

'సెల్ఫీ విత్ టాపర్స్'

- ప్రభుత్వ పాఠశాలల్లో వినూత్న కార్యక్రమం
- విద్యార్థులను అన్ని విధాలా ప్రోత్సహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం



మాధవధార హైస్కూల్‌లో ఇంగ్లిష్‌లో టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులతో హెచ్ఎం హేమలత, ఇంగ్లిష్ టీచర్



మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో అన్ని తరగతుల టాపర్లతో హెచ్ఎం, ఉపాధ్యాయుల సెల్ఫీ

సీతంపేట: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించేలా రాష్ట్ర ప్రభుత్వం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్ర విద్యా శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ ఆదేశాలతో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం సెల్ఫీ విత్ టాపర్స్ కార్యక్రమం నిర్వహించారు. బాగా చదివి మంచి మార్కులు సాధించాలనే పోటీతత్వాన్ని విద్యార్థుల్లో పెంచేందుకు ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల్లో ప్రతి సబ్జెక్ట్‌లోను, క్లాస్‌లో టాపర్లను ఎంపిక చేసి సంబంధిత సబ్జెక్టు టీచర్లు, హెచ్ఎంలు సెల్ఫీ ఫొటో తీసి ప్రిన్సిపాల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్‌కు వాట్సాప్ చేసినట్టు మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్ హెచ్ఎం శాంతి కుమారి తెలిపారు.

◆ ముస్లిం తాటిచెట్లపాలెం జీవీఎంసీ ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో, అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో టాపర్లతో హెచ్ఎంలు శాంతికుమారి, లక్ష్మీ నరస సెల్ఫీ తీసుకున్నారు. విద్యార్థులను మరింత ప్రోత్సహించేలా, టాపర్లను చూసి మిగిలిన విద్యార్థులు స్ఫూర్తి పొందేలా రూపొందించిన సెల్ఫీ విత్ టాపర్స్ కార్యక్రమం చాలా బాగుందని ఉపాధ్యాయ సిబ్బంది కితాబిచ్చారు.

ఉత్తమ విద్యార్థులకు అభినందన

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు సీతమ్మధార పీ అండ్ టీ కాలనీలోని ఎస్ఎంసీ హైస్కూల్‌లో ఎఫ్–3 పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులతో తల్లిదండ్రుల సమక్షంలో సెల్ఫీ విత్ టాపర్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం రాంప్రసాద్ మాట్లాడుతూ 6 నుంచి 10వ తరగతి వరకు 995 మంది విద్యార్థులకు గానూ ప్రతి క్లాస్‌లో ముగ్గురు చొప్పున టాపర్స్‌గా నిలిచిన వారి ఫొటోలను ఉపాధ్యాయులు తీసి ప్రిన్సిపల్ సెక్రటరీకి ప్రవీణ్ ప్రకాశ్ పంపించినట్లు తెలిపారు. ఉపాధ్యాయుడు పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పదో తరగతి–ఏ సెక్షన్‌లో ఎక్కువ మార్కులు సాధించిన కె.బాలహర్షిత, వి.హేమ, డి.రేణుకలను అభినందించారు. హెచ్ఎం రాం ప్రసాద్, టీచర్ శ్రీనివాసరావు విద్యార్థులతో సెల్ఫీ తీసుకున్నారు.

పోటీతత్వం.. మరింత ఆసక్తి

మురళీనగర్: మాధవధార జీవీఎంసీ హైస్కూల్, ఏఎస్సార్ నగర్‌లోని కె.కాలనీ హైస్కూల్‌లో ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన టాపర్లతో సబ్జెక్టు టీచర్లు, ప్రధానోపాధ్యాయులు సెల్ఫీ తీసుకుని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. విద్యార్థుల్లో పోటీతత్వంతోపాటు చదువుపై మరింత ఆసక్తి పెరగడానికి అవకాశం ఏర్పడిందని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. 7వ తరగతిలో మ్యాథ్స్ టాపర్లుగా బి.వర్షిణి, ఎం.నవదీప్, ఎ.కాంచన, 10వ తరగతి ఇంగ్లిష్‌లో టాపర్లుగా తేజేష్ రెడ్డి, స్వాతి, లావణ్య, యశ్విని, శ్రావణి, కీర్తి, కల్యాణి, రత్న వర్షిణి, సూరజ్, విజయ్‌లు, 9వ తరగతి ఇంగ్లిష్‌లో డి.రూప, ఎస్.హర్షిణి, బి.మోక్ష, హెచ్.భవ్యసాయి, బి.దేవేంద్ర టాపర్‌లుగా నిలిచారు. వీరందరూ వంద శాతం మార్కులు సాధించడం విశేషం. మాధవధార హైస్కూల్ హెచ్ఎం బి.హేమలత విద్యార్థులను అభినందించారు.

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీ హైస్కూల్‌లో సోషల్ సబ్జెక్టులో టాపర్స్‌గా నిలిచిన జి.కౌషిక్, సిహెచ్.నిఖిల్, ఎస్.కార్తికేయలతో ఉపాధ్యాయుడు జె.డి.ఆనంద్ సెల్ఫీ తీసుకున్నారు.



ఎస్ఎంసీ హైస్కూల్‌లో టాపర్స్‌తో సెల్ఫీ తీసుకుంటున్న ఉపాధ్యాయులు



ఎంటీసీ పాలెం ఉర్దూ పాఠశాలలో టాపర్స్‌తో సెల్ఫీ తీసుకుంటున్న హెచ్ఎం శాంతికుమారి



రైల్వే న్యూకాలనీ హైస్కూల్‌లో టాపర్లతో సోషల్ టీచర్ ఆనంద్

9 నుంచి ఉచిత యోగా తరగతులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి ఉచిత యోగా తరగతులు నిర్వహిస్తున్నట్లు కేంద్రం సంచాలకులు ఆచార్య ఒ.ఎస్.ఆర్.యు.భానుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థూలకాయ నివారణకు ఈ శిబిరం 8 వారాల పాటు జరుగుతుందన్నారు. ప్రతి రోజూ ఉదయం 6–7 గంటల వరకు 7.15 నుంచి 8.15 గంటల వరకు శిక్షణ తరగతులు ఉంటాయని, ఆసక్తి గల వారు 91678 89881, 70970 99900 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

వైభవుడికి సుప్రభాత సేవ



ఆలయ ప్రదక్షిణలో అర్చకులు, భక్తులు

మురళీనగర్: కప్పరాడ ఎన్జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన చేశారు. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నసమారాధన జరిపారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పర్యావరణ హితమే ధ్యేయం



పెరటి మొక్కలను తిలకిస్తున్న విద్యార్థులు



మాట్లాడుతున్న యూసీడీ పీవో లక్ష్మి

మురళీనగర్: ప్రతి విద్యార్థి పర్యావరణ హితంగా జీవించడమే ధ్యేయంగా మెలగాలని జీవీఎంసీ యూసీడీ ప్రాగ్రాం ఆఫీసర్ లక్ష్మి అన్నారు. మురళీనగర్ ఎస్ఎస్ ఫంక్షన్ హాల్‌లో శనివారం మురళీనగర్ గార్డెనర్స్ ఆర్ట్ అండ్ మినియేచర్ ఎగ్జిబిషన్, ఇంటి దగ్గరే కూరగాయలు పండించుకునే విధానాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మినియేచర్ ప్రదర్శన ప్రతి ఒక్కరినీ ఆకర్షించేలా ఉందన్నారు. ప్రతి ఇంటా పచ్చదనం పెంపొందించే క్రమంలో మొక్కలు పెంచాలని పిలుపునిచ్చారు. భారత కిసాన్ సంఘ్ జాతీయ నాయుడు జలగం కుమారస్వామి మాట్లాడుతూ రేపటి తరం స్వచ్ఛమైన వాతావరణంలో జీవించేలా ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. చిన్నపిల్లల వైద్యుడు డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ గుడ్డ సంచుల వాడకంపై విద్యార్థులు తమ తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ రిటైర్డ్ మేనేజర్ ఉదయభాస్కర్ వేసిన ఆర్ట్స్, ప్రొఫెషనల్ మినియేచర్ ఆర్టిస్ట్ జి.రమాదేవి ఏర్పాటు చేసిన మినియేచర్స్ ఆకట్టుకున్నాయి. మినియేచర్ ప్రదర్శనను విద్యార్థులు తిలకించారు. కార్యక్రమంలో గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు డి.సుబ్రహ్మణ్య వర్మ, జీవీఎంసీ ఎస్ఆర్‌యూ ప్రతినిధి అక్షత, కార్యక్రమ నిర్వాహకులు అరుణ, విశ్రాంత రైల్వే అధికారి కేవీఎస్ రాజు, కైట్స్ స్కిల్స్ సంస్థ ఎండీ జ్యోగి నాదెళ్ల, గ్రీన్ క్లైమేట్ టీఎం కార్యదర్శి జేవీ రత్నం పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో మద్యం బాటిళ్ల స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్‌లో గవర్నమెంట్ రైల్వే పోలీసులు చేసిన తనిఖీల్లో 6 మద్యం బాటిళ్లతో కూడిన బ్యాగ్‌ను గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా.. విశాఖపట్నం డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ బి.మోహనరావు ఆదేశాలతో ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు నేతృత్వంలో సిబ్బంది శనివారం రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో మొదటి ప్లాట్‌ఫాంపై నల్లని బ్యాగ్‌ను గుర్తించి, తనిఖీ చేయగా దానిలో 6 మద్యం బాటిళ్లు గుర్తించారు. ఈ బ్యాగ్ గురించి ఎవరూ ముందుకురానందున దీనిని అన్‌క్లెయిమ్డ్ ప్రాపర్టీగా గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.



జీఆర్పీ స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

రహదారి ఆక్రమణలతో సమస్యలు



బీవీకే కళాశాల ఎదురుగా రోడ్డును సగ భాగం ఆక్రమించిన టిఫిన్ బండి



ద్వారకానగర్ పౌర గ్రంథాలయాన్ని ఆనుకొని ఏర్పాటు చేసిన బడ్డీలు

సీతంపేట: ప్రధాన రహదారుల్లో ఆక్రమణలతో నిత్యం ట్రాఫిక్ సమస్యలతోపాటు ప్రమాదాలకు దారితీస్తున్నాయి. ద్వారకానగర్ పౌర గ్రంథాలయం గోడకు ఆనుకొని రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన బడ్డీలు, శ్రీకృష్ణ విద్యామందిర్ గోడకు ఆనుకొని ఏర్పాటు చేసిన బడ్డీలు, టిఫిన్ బళ్లు, ఆటో సంఘం ఆఫీస్ ఏర్పాటుతో రహదారి కుచించుకుపోయి తరచూ ట్రాఫిక్ జామ్ అవడం, రోడ్డు ప్రమాదాలు జరగడానికి కారణమవుతున్నాయి. దీనికి తోడు టిఫిన్ బళ్లు, బడ్డీల వద్దకు వచ్చే వారి వాహనాల పార్కింగ్‌తో మరింత ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. పౌర గ్రంథాలయం రోడ్డు నుంచి ద్వారకానగర్ మెయిన్ రోడ్డుకు వెళ్లే ఈ మార్గం రెండు వైపులా ఆక్రమణకు గురైంది. ముఖ్యంగా రోడ్డు మలుపులో బడ్డీలు ఏర్పాటు చేయడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక రాత్రి సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్‌లో గ్రంథాలయం, స్కూల్స్, బీవీకే కళాశాల ఉండటంతో నిత్యం రద్దీగా ఉంటుంది. రామాటాకీస్ రోడ్ నుంచి ద్వారకానగర్‌కు వెళ్లడానికి ప్రధాన మార్గం కావడంతో వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటుంది. అటువంటి మార్గంలో రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తూ ట్రాఫిక్ సమస్యలకు కారణమవుతున్న వారిపై సంబంధిత అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని స్థానికులు చెబుతున్నారు. స్మార్ట్ సిటీకి తగినట్టు ఆక్రమణలు తొలగించి సాఫీగా ప్రయాణాలు సాగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సంకల్ప సభ విజయవంతానికి పిలుపు

సీతమ్మధార: అంబేడ్కర్ ఆశయ సాధనకు, జాతి విముక్తికి సమర శంఖం పూరించాలని ఏఐఎం జిల్లా ఇన్‌చార్జి మామిడి శ్రీనివాసరావు, జల్లి రాజశేఖర్ పిలుపునిచ్చారు. దొండపర్తి కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 10న ఏఐఎం (అంబేడ్కర్ ఇండియన్ మిషన్) వ్యవస్థాపక అధ్యక్షుడు పి.వి.సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో జరగనున్న దళితవాడ పంచాయతీ సాధన సంకల్ప సభను విజయవంతం చేయాలని కోరారు. ఇటీవల పి.వి.సునీల్‌కుమార్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి దళితవాడ పంచాయతీలకు అనుకూలంగా జీవో విడుదల చేయాలని కోరినట్లు చెప్పారు. దళిత కోటాలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, కార్పొరేషన్ పదవులు పొందిన వారు దళితుల అభ్యున్నతి కోసం ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. మామిడి రాజు, లంకా శ్రీనివాస్, ఎం.రాజశేఖర్, ఆర్.నారాయణరావు, కె.సతీష్ పాల్గొన్నారు.

బూత్ లెవల్ ఏజెంట్లకు దిశానిర్దేశం

సీతమ్మధార: ప్రతి ఒక్క బూత్ లెవల్ ఏజెంట్ (బీఎల్ఏ) ఇంటింటికీ వెళ్లి కొత్త ఓటర్ లిస్టు ద్వారా ఓటర్లు ఉన్నారా లేదా అని పరిశీలించి, దొంగ ఓట్లు లేకుండా చూడాలని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు సూచించారు. 24వ వార్డు నక్కవానిపాలెం సామాజిక భవనంలో కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఆధ్వర్యంలో శనివారం పార్టీ ముఖ్య నాయకులు, బీఎల్ఏలతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట తప్పకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు 600 హామీలు ఇచ్చి.. ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు చేయలేదన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి పాలనలో విశాఖకు ఐటీ కంపెనీలు తీసుకొచ్చారని గుర్తుచేశారు. అనంతరం పార్టీ ముఖ్య నేతలు, గృహసారథులు, కన్వీనర్లు, నాయకులకు కె.కె.రాజు సంక్రాంతి కానుకలు అందించారు. సమావేశంలో పార్టీ మండల ఇన్‌చార్జి జి.వి.రమణి, సభ అధ్యక్షులు గుడ్ల రాఘురామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ కర్రి మురళీకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

46, 47 వార్డుల్లో..

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు తాటిచెట్లపాలెం శాంతినగర్ కమ్యూనిటీ హాల్‌లో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, 47వ వార్డు కంచరపాలెం రాంజీ ఎస్టేట్ కమ్యూనిటీ హాల్‌లో కార్పొరేటర్ కె.కామేశ్వరి నేతృత్వంలో శనివారం పోలింగ్ బూత్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం పార్టీ శ్రేణులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ కో–ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, కె.చిన్నా, కృపా, గోవింద్, పలివేల ఈశ్వరి, వరలక్ష్మి, నరేష్, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

42వ వార్డులో..

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు న్యూకాలనీ మసీదు వద్ద కార్పొరేటర్ ఆళ్ల లీలావతి సూచనల మేరకు వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆళ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు, బీఎల్ఏల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథి పార్టీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు మాట్లాడుతూ బీఎల్ఏలకు పలు సూచనలిచ్చారు. కార్యకర్తలకు నూతన వస్త్రాలను ఆయన అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గాలి ప్రసాద్, సబ్బి నూకరాజు, వెంకటేష్, కంచు మూర్తి, చందన్‌సాయి తదితరులు పాల్గొన్నారు.



24వ వార్డు సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు



46వ వార్డులో వస్త్రాలు అందజేస్తున్న కె.కె.రాజు, కటుమూరి సతీష్



42వ వార్డులో కానుకలు అందిస్తున్న కె.కె.రాజు

నేడు వ్యాకులమాత మహోత్సవం

కంచరపాలెం: విశాఖ అతి మేత్రాసనం, పారిస్ పాస్టిల్ కౌన్సిల్(పీపీసీ) సంయుక్త ఆధ్వర్యంలో కొత్తవలస కొండడాబాలకు చెందిన వ్యాకులమాత పుణ్యక్షేత్రంలో ఈ నెల 4న ఆదివారం జరగనున్న పాప పశ్చాత్తాప ఉత్సవం నిర్వహించనున్నారు. జ్ఞానాపురం పునీత పేతురు ప్రధాన దేవాలయం ఆధ్వర్యంలో కొండడాబాల వద్ద సాయంత్రం నుంచి రాత్రి వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జ్ఞానాపురంలో శనివారం ఉదయం 8 గంటలకు సెయింట్ పీటర్స్ విచారణ కర్త రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ దివ్యపూజా బలి నిర్వహించారు. అంతకు ముందు ప్రధాన దేవాలయంలో వేర్వేరుగా చర్చి ఫాదర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆదివారం జరగనున్న ఈ పండగకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పుణ్యక్షేత్రాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. పీపీసీ అధ్యక్షుడు ఎస్. రాజేష్‌బాబు, జి. శ్యామలరావు, స్వర్ణలత తదితరులు పనులు పర్యవేక్షించారు.

పాప పశ్చాత్తాప పాదయాత్ర..

జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ పునీత పేతురు ప్రధాన చర్చి నుంచి శనివారం ఉదయం పాప పశ్చాత్తాప పాదయాత్ర చేపట్టారు. కాలి నడకలో భాగంగా వేల సంఖ్యలో భక్తులు మేరీమాతను స్మరిస్తూ జ్ఞానాపురం నుంచి కంచరపాలెం, మర్రిపాలెం, ఎన్ఏడీ కొత్తరోడ్డు, గోపాలపట్నం, వేపగుంట, పెందుర్తి, కొత్తవలస వరకు పాదయాత్ర చేపట్టారు. భక్తి గీతాలు ఆలపిస్తూ సందడిగా పాదయాత్ర చేశారు.

దూరాభారమైనా.. వలంటీర్ సేవా దృక్పథం



విజయనగరం జిల్లా నుంచి అక్కయ్యపాలెం వచ్చి వృద్ధుడికి పెన్షన్ అందిస్తున్న వలంటీర్ లలిత



గీతం ఆస్పత్రిలో లబ్ధిదారుడికి పెన్షన్ సొమ్ము అందజేస్తున్న వెల్ఫేర్ సెక్రటరీ పరిమళ

సీతంపేట: విజయనగరం జిల్లాకు చెందిన బెల్లాన అప్పలనాయుడు అనే వృద్ధాప్య పింఛన్‌దారుడు విశాఖలో చికిత్స పొందుతున్నాడు. అక్కడి వలంటీర్ గంట్రోతు లలిత శనివారం విశాఖకు వచ్చి వృద్ధుడికి పింఛన్ డబ్బులు అందజేసి తన నిబద్ధతను చాటుకుంది. వివరాలిలా.. విజయనగరం తుమ్మకాపల్లిలో నివసించే అప్పలనాయుడికి కొద్ది రోజులుగా ఆరోగ్యం బాగోలేక పోవడంతో వైద్య చికిత్స కోసం అక్కయ్యపాలెంలో ఉన్న కొడుకు ఇంటికి వచ్చాడు. విషయం తెలుసుకున్న తుమ్మకాపల్లి సచివాలయం వలంటీర్ గంట్రోతు లలిత అక్కడి నుంచి బస్సులో విశాఖ వచ్చి పింఛన్ సొమ్ము పంపిణీ చేసింది. ఎంతో వ్యయప్రయాసలతో విజయనగరం జిల్లా నుంచి వచ్చి పింఛన్ అందజేయడంతో అప్పలనాయుడు కుటుంబ సభ్యులు వలంటీర్ సేవా దృక్పథాన్ని అభినందించారు. జగనన్న పుణ్యామా అని ఉన్నచోటనే పెన్షన్ అందుకోగలిగానని అప్పలనాయుడు సంతోషం వ్యక్తం చేశాడు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత

జీవీఎంసీ 44వ వార్డు ఎంటీసీ పాలెం సచివాలయం(238) పరిధిలో ఉంటున్న సీరపు తిరుపతిరావు గుండె సంబంధిత వ్యాధితో గీతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వెల్ఫేర్ సెక్రటరీ పరిమళ ఆస్పత్రికి వెళ్లి దివ్యాంగ పెన్షన్ డబ్బులు అతడికి అందజేశారు. ఆస్పత్రికి వచ్చి పింఛన్ పంపిణీ చేయడంతో లబ్ధిదారుడి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

16 కిలోల గంజాయి పట్టివేత



టాస్క్‌ఫోర్స్ పోలీసుల అదుపులో గంజాయి నిందితులు

సీతమ్మధార: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న నలుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా.. పోలీస్ కమిషనర్ డా.రవిశంకర్, అడిషనల్ కమిషనర్ నాగేంద్రుడు (స్పెషల్ బ్రాంచ్) ఆదేశాల మేరకు ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ విశాఖ ఐ హాస్పిటల్ వద్ద శనివారం నలుగురు వ్యక్తులు అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నారనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.త్రినాథ్ తన సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. ఆ ప్రాంతంలో అనుమానాస్పదంగా కనిపించిన నలుగురిని అదుపులోకి తీసుకుని విచారించగా.. వారి వద్ద 16 కిలోల గంజాయి, రెండు బైక్‌లు, నాలుగు సెల్‌ఫోన్లు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను ద్వారకా పోలీసులకు అప్పగించారు. ద్వారకా సీఐ రమేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ కె.మల్లేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.